


సీతంలో ఘనంగా పారిశ్రామికవేత్తల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన గ్రీన్ జామ్స్ వ్యవస్థాపకులు జామి తరుణ్, ది ట్విస్ట్ వ్యవస్థాపకులు వి.శిల్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ వ్యవస్థాపకత, అనుకూలతల ప్రాముఖ్యతను, మెలకువలు తెలుసుకొని యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం శిల్ప మాట్లాడుతూ వ్యర్థాల నుంచి నూతన ఉత్పత్తులను తయారు చేసే దిశగా యువత పరిశ్రమలను స్థాపించాలని కోరారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులలో వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, ఇడిసి సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురిసినా వెనుకబాటే

- లక్ష్యానికి దూరంగా ఖరీఫ్ సాగు
- పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- ఆందోళనలో రైతులు



ఇంకా పడని వరినాట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పుష్కలంగా వర్షం కురిసింది. అందుకు తగ్గట్టే పొలం తడిసింది. వరినారు ఏపుగా పెరిగింది. కానీ, ఉబాలు లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగలేదు. చెరకు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు కూడా అంతంత మాత్రంగానే సాగయ్యాయి. ఇందుకు ముమ్మాటికీ పాలకులు ప్రదర్శించిన నిర్లక్ష్యమే కారణం. దీంతో రైతాంగం ఆందోళనకు గురౌతోంది. పెట్టుబడులు ఏమౌతాయో అన్న బెంగ ఓ వైపు.. శ్రమ వృథాగా పోతుందా? అన్న ఆందోళన ఇంకోవైపు. ఏ రైతును కదిపినా ఇదే వ్యథ.

జిల్లాలో సాధారణంగా జూన్ చివరి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. గత కొన్నాళ్ల నుంచి రుతుపవనాలు ఆలస్యం కావడంతో జులై ఒకటి లేదా రెండో వారంలోనైనా నారు పోతలు మొదలయ్యేవి. ఈ ఏడాది అందుకనుగుణంగా వర్షాలు కురవడంతో వరినారు పోతలు, ఇతర పంటల సాగు ఒకింత ఉత్సాహంగానే మొదలైంది. అయినప్పటికీ కురిసిన వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు తగిన సాగునీటి వనరులు లేకపోవడంతో సముద్రం పాలైంది. మరోవైపు ఎండల తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో కాస్త చెరువుల్లో చేరిన నీరు ఆవిరైపోతోంది. దీంతో, ఎదిగిన వరినారు ముందు పెట్టుకుని వరుణుడి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా ప్రధాన పంట వరి. ఖరీఫ్ సీజన్‌లో 2,25,637 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 75,770 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. గత ఏడాది ఇదే సరిగ్గా సమయానికి 1,35,477 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. దీన్నిబట్టి సుమారు 30 శాతం వెనుకబడి ఉన్నట్టు స్పష్టమౌతోంది. మొక్కజొన్న గత ఏడాది ఇదే సమయానికి 29,472 ఎకరాల్లో సాగవగా, ప్రస్తుతం 19,885 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇందులోనూ 25 శాతం వ్యత్యాసం కనిపిస్తోంది. పత్తి గతేడాది 4,310 ఎకరాలు సాగు కాగా, ప్రస్తుతం 3 వేలకు మించలేదు. చెరకు సాగు 10,392 ఎకరాలకు గాను ప్రస్తుతం 7 వేల ఎకరాలు మాత్రమే సాగైంది. వేరుశనగ గతేడాది ఇదే సమయానికి 767 ఎకరాలు కాగా, ఈ ఏడాది 420 ఎకరాల్లో మాత్రమే సాగు అయింది. నువ్వులు, ఇతర అపరాలు తదితర పంటలన్నింటి సాగులోనూ ఇదే రకమైన వెనుకబాటు కనిపిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో అన్ని పంటలు కలుపుకుని 3,17,052 ఎకరాల మేర సాగు విస్తీర్ణం కాగా, గత ఏడాది ఇదే సమయానికి 2,01,535 ఎకరాల్లో సాగు కనిపించింది. ఈ ఏడాది కేవం 1, 38,755 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. గత ఏడాది అన్ని పంటలూ కలుపుకుని ఈ సమయానికి 64 శాతం సాగవగా, ఈ ఏడాది 43 శాతమే సాగయ్యాయి. మరోవైపు సీజన్ ముంచుకెళ్తోంది. వర్షపాతాన్ని పరిశీలిస్తే సాధారణ వర్షపాతం కన్నా 10 మిల్లీమీటర్ల వర్షపాతం అధికంగానే కురిసింది. జూన్ నుంచి ఇప్పటి వరకు 340.2 మిల్లీమీటర్ల వర్షపాగానికి గాను ఇప్పటి వరకు 440.1 మి.మీ వర్షం కురిసింది. దీన్నిబట్టి వర్షాలు కురిసినా వాటిని నిల్వచేసేందుకు తగిన వనరులు ప్రభుత్వం తయారు చేయలేదన్నది స్పష్టమౌతోంది.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

వేగంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఈ నెల 25న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.నాగలక్ష్మి పరిశీలించారు. సోమవారం సాయంత్రం మెంటాడ మండలం కుంటినవలస, దత్తిరాజేరు మండలం మరడాం గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. మరడాం వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభాస్థలిని సందర్శించారు. అధికారులతో మాట్లాడి చేస్తున్న ఏర్పాట్లను తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో, వర్షం పడినా సభకు ఎటువంటి ఇబ్బంది రాకుండా, పటిష్టమైన సభా వేదికను, షామియానాను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరాటంకంగా సభ జరగాలని, ఎటువంటి అంతరాయం కలగకూడదని స్పష్టం చేశారు. కూర్చోడానికి సరిపడా కుర్చీలను, లైటింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించారు. విఐపిల వాహనాలకు వేరుగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని, సామాన్యులు తరలివచ్చే వాహనాలకు సభాస్థలి సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడ కూడా విఐపిలు వేచి ఉండటానికి, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖను, డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు.

కుంటినవలసలో గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమం, శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో చేపడుతున్న నేలను చదును చేసే పనులపై ఆరాతీశారు. వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. ఇక్కడినుంచి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్న సుమారు 4 కిలోమీటర్ల రహదారి పనులను తనిఖీ చేశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో వినతులకు పరిష్కారం

కలెక్టర్ నాగలక్ష్మి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్నకు చెబుదాంలో మున్సిపాలిటీల పరిధిలో వచ్చిన వినతులను ఆయా ప్రత్యేకాధికారులు అన్ని శాఖలతో సమావేశమై సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను పరిష్కరించిన విధానంపై గత వారంలో ఆయా అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్.. జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు వంటి పలు శాఖలు ఉమ్మడిగా పరిష్కరించాల్సిన సమస్యలపై ఆయా శాఖల అధికారులు, ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో కలిసి చర్చించాలన్నారు. వాటిని ఎలా పరిష్కరించాలో నిర్ణయించాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు ఎం.లావణ్య, సులోచన రాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 214 వినతులు

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 214 వినతులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 145, ఆసుపత్రి సేవలకు 4, ఇపిడిసిఎల్‌కు 2, వైద్య ఆరోగ్య శాఖకు 5, పంచాయతీ శాఖకు 10, హౌసింగ్‌కు 8, మున్సిపల్ 4, డిఆర్‌డిఎ 11, గ్రామ, వార్డు సచివాలయ శాఖకు 25 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్లు ఎం.లావణ్య, సులోచన రాణి వినతులు స్వీకరించారు. ఆయా వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు.

రోగాల బారిన పడకుండా కాపాడాలి

విజయనగరంకోట : నగర ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని టిడిపి నాయకులు స్పందనలో కలెక్టర్‌కు వినతి అందించారు. నగరంలో దోమలు విపరీతంగా పెరిగాయని, వాటిని అరికట్టడానికి నగర పాలకులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కనక మురళీమోహన్, బంగారు బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

చలో విజయవాడ విజయవంతానికి

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరుతూ ఈ నెల 24న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావుతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మధ్యవర్తులు లేని వ్యవస్థను తీసుకొస్తానని ఆప్కోస్‌ను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పంపు హౌస్ కార్మికులను అందులో చేర్చి, విజయనగరంలో మాత్రం మెన్, మెటీరియల్ వేరు చేయకుండా కాంట్రాక్టర్ వ్యవస్థను కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పైపులైను మరమ్మతుల పేరుతో కోట్ల రూపాయలు టెండర్లు పాడుతున్న, కార్మికులకు మాత్రం రూ.9 వేల నుంచి 12 వేలు మాత్రమే జీతం చెల్లిస్తున్నారని, అది కూడా సకాలంలో ఇవ్వడం లేదని వాపోయారు. అడిగితే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే వీరందరినీ కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఆప్కోస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి, కలెక్టర్‌కి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, ఫెడరేషన్ నాయకులు రాఘవ, కార్మికులు గంగయ్య ,మణికంత ,శ్రీను, నారాయణ, రామ్మోహనరావు, చెల్లయ్య, గౌరీ, గోవిందరావు, రాము, ఈశ్వరరావు, కృష్ణ, లక్ష్మీనారాయణ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్మన్‌కు అరుదైన గౌరవం

జాతీయస్థాయి వర్క్‌షాపులో పాల్గొన్న మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు అరుదైన అవకాశం దక్కింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో సుపరిపాలన అంశంపై శ్రీనగర్‌లో సోమవారం ప్రారంభమైన మూడు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని జెడ్‌పి చైర్మన్లందరికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ, ఆంధ్రప్రదేశ్ తరపున ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సుకు పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, అడిషనల్ కమిషనర్ ఎం.సుధాకరరావు, విజయనగరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపిపి భాస్కరరెడ్డి, ఎస్‌పిసి (ఐటి) బాలాజీ, తణుకు మండలం దువ్వ సర్పంచ్ ఎ.వెంకట సూర్యనారాయణ మూర్తి, ఎలమంచిలి మండలం పెనుమర్రు సర్పంచ్ కె.గోపి రాష్ట్రం తరపున హాజరయ్యారు. సుపరిపాలన ద్వారా సుస్థిరాభివృద్ధి సాధించడం, ప్రజలకు మెరుగైన పాలన, విద్య, వైద్య సదుపాయాలను అందించడం ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశం. సదస్సులో పాల్గొన్న తరువాత, కేంద్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రిని, వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులను, కేంద్ర ఉన్నతాధికారులను కలిసి, పలు అంశాలపై శ్రీనివాసరావు చర్చించారు.



కేంద్రమంత్రితో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భూముల కేటాయింపు సక్రమమే

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

గ్రోత్‌సెంటర్లో సత్య బయోఫ్యూయల్ పరిశ్రమకు భూముల కేటాయింపులో అక్రమాలు లేవని, ఎపిఐఐసి నిబంధనలకు లోబడి భూములు కేటాయింపు జరిగిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు స్పష్టంచేశారు. సోమవారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రోత్‌సెంటర్లో పరిశ్రమకు భూముల కేటాయింపుపై వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు. హెరిటేజ్ సంస్థ ఎంతకు భూములు తీసుకుందని, ఎచ్చెర్లలో కళా వెంకటరావు ఎంతకు తీసుకున్నారని ప్రశ్నించారు. సత్య బయోఫ్యూయల్ పరిశ్రమకు ఎంతధరకు కేటాయించారో, ప్రతిపక్షాలు, ఇతర పారిశ్రామిక వేత్తలకు కూడా అలాగే కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎపిఐఐసి నిబంధనల మేరకు భూమి కేటాయిస్తే చిల్లర ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

పంచాయతీ ఉపఎన్నికల్లో వైసిపి విజయకేతనం

పంచాయతీ ఉపఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసిందని ఎమ్మెల్యే శంబంగి అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 10 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగితే, ఎనిమిది మంది వైసిపి మద్దతుదారులు విజయం సాధించారన్నారు. కానీ ప్రతిపక్షాలు భుజాలు ఎగరవేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ టి.దామోదర్, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఓటు తొలగిస్తే అప్పీల్‌కు అవకాశం


ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా నుండి ఓటు పొరపాటున తొలగించబడితే ఓటరుకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పౌరచట్టం 1950, సెక్షన్ 24 ప్రకారంగా జిల్లా ఎన్నికల అధికారికి అప్పీల్ చేసుకోవచ్చునని, లేదా ఫారం-6 ద్వారా సంబంధిత ఇఆర్ఒ వద్ద ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపడుతున్నారని, ఈ సమయంలో బిఎల్ఒ ద్వారా కూడా ఓటు నమోదు చేసుకోవచ్చునని స్పష్టం చేశారు.

ఎన్‌సిఎస్, భీమసింగి పరిశ్రమను తెరిపించాలని

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ధర్నా చేస్తున్న రైతుసంఘాల సమన్వయ కమిటీ నాయకులు

భీమసింగి ఫ్యాక్టరీతోపాటు మూతపడిన ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెరిపించాలని రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి సమన్వయ కమిటీ కన్వీనర్ బి.రాంబాబు మాట్లాడుతూ రైతు సంక్షేమ ప్రభుత్వమని చెపుతూ జిల్లాలో ఉన్న చక్కెర పరిశ్రమలను మూసివేసి రైతులకు ద్రోహం చేశారన్నారు. జిల్లా రైతులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మూత వేసిన చక్కెర పరిశ్రమలను తెరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతి అందించారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు దేవుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేసిన వారికి తక్షణ న్యాయం చేయాలని ఎస్‌పి దీపిక.. పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఎస్‌పి వినతులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వారం రోజుల్లో వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని సూచించారు. ఎస్‌పి స్పందనలో 36 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, విజయనగరం డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఎస్‌ఐ వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మిత్రుల సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణానికి చెందిన ఆర్థికంగా వెనుకబడిన కడిమిశెట్టి వెంకటరత్నం కుమార్తె చంద్రకళ వివాహం నిమిత్తం సోమవారం జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ రూ.31 వేల నగదు, దుస్తులు అందజేసింది. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా పెండ్లి కుమార్తెకు బంగారు శతమానం అందించారు. కార్యక్రమంలో గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, సముద్రాల నాగరాజు, కుమార్, ఎ.వి.కృష్ణారావు, గుంపిన నారాయణరావు పాల్గొన్నారు.

23న టంగుటూరి జయంతి

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 23న ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ పరిధిలోనున్న హెచ్‌ఒడిలు, వారి సిబ్బందితో కలసి ఈ వేడుకలకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.



నిరసన చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్రశిక్ష, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు బి.కాంతారావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష, కెజిబివి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం ఆఫ్ టైంస్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా, సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతనాల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రమూ చొరవ చూపడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, రవాణా ఛార్జీలు, పెట్రోల్ ఖర్చులతో ఉద్యోగులు అల్లాడుతున్నారని వాపోయారు. వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

ప్రవీణ్ ప్రకాశ్‌ను కలిసిన జెడ్‌పిటిసి


ప్రవీణ్‌ప్రకాష్‌ను కలిసిన జెడ్‌పిటిసి సన్యాసినాయుడు

నెల్లిమర్ల: ప్రాథమిక విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్‌ను జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు సోమవారం అమరావతిలోని సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 430 మంది విద్యార్థులు ఉండగా కేవలం ఒక ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఉందని అదనంగా మరో పోస్ట్ మంజూరు చేయాలని కోరారు. ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ లేదని ఆ పోస్ట్‌ను కూడా మంజూరు చేయాలన్నారు. ఒక రికార్డు అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేయమని, జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ కూడా అవసరం ఉందని ఆయనకు వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు జెడ్‌పిటిసి తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో జాగ్రత్త వహించాలి

బొబ్బిలిరూరల్: ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్‌లో జాగ్రత్త వహించాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయం ఆవరణలో బిఎల్‌ఒలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌస్ టు హౌస్ సర్వేను విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరు బిఆర్‌ఓలకు అభినందనలు అన్నారు. హౌస్ టు హౌస్ సర్వేలో సేకరించిన సమాచారం మేరకు ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లను ఓటర్ల జాబితాకు జత చేయడానికి, ఫారం 7ద్వారా చనిపోయిన, వేరే ప్రాంతానికి శాశ్వతంగా వలస పోయిన, డూప్లికేట్ ఓటర్‌గా నమోదైన ఓట్లను తొలగించడానికి, ఫారం 8 ద్వారా ఓటును బదిలీ చేయడానికి పేరులో గాని, ఇంటి అడ్రస్‌లో గాని సవరణ చేయడానికి ఉపయోగించి ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయం పున:నిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఆయన సతీమణి చిన్నమ్మలు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయానికి వందేళ్లు పూర్తి కావడంతో పున:నిర్మాణానికి ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసింది. ఎమ్మెల్యే శంబంగి దంపతులు, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు శంకుస్థాపన చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రేగిడి: మండల విద్యా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల జెఎసి నాయకులు ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, ఎసి సూర్యారావు, డేటా కంప్యూటర్ ఆపరేటర్ అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఆర్‌సి కార్యాలయంలో వారంతా ధర్నా నిర్వహించారు. తమను వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ధర్నాను ఉధృతం చేస్తామని తెలిపారు.

12 అడుగుల కింగ్‌కోబ్రా హతం

వేపాడ : మండలంలో సోంపురం గ్రామం నుండి జాకేరు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల వద్ద ఆదివారం రాత్రి 11 గంటలకు కింగ్ కోబ్రాను గ్రామస్తులు హతమార్చారు. రాత్రి సమయంలో పాము బుస కొడుతున్న శబ్దానికి అప్రమత్తమైన రైతులు పామును గుర్తించి చంపేశారు. ఇటువంటి పాములు కొండల్లోనే తప్ప మైదాన ప్రాంతాల్లో ఉండడం అరుదని దీన్ని కింగ్ కోబ్రాగా పిలుస్తారని ఇది కాటు వేస్తే క్షణాల్లో మరణిస్తారని రైతులు చెబుతున్నారు.

ముగిసిన ఆనందోబ్రహ్మ షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ

బొబ్బిలి : గత మూడు రోజులుగా యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రీకరిస్తున్న ఆనందోబ్రహ్మ రీల్స్ చిత్రీకరణ పూర్తయిందని ముగిసిందని దర్శకుడు యం.విజయ మోహన్ రావు అన్నారు. సోమవారం ఉదయం స్థానిక మల్లమ్మదేవి పార్కులో ఎబిసిడి డాన్స్ అకాడెమీ విద్యార్థులపై ఒక నృత్య సన్నివేశం చిత్రీకరణ జరిపారు. పాత బొబ్బిలి, భైరు సాగరం, యుద్ధ స్థంభం, రాజా వారి గెస్ట్ హౌస్ పరిసరాల్లో గత మూడు రోజులుగా ఈ షార్ట్ ఫిల్మ్ షూటింగ్ చేశామని విజయ మోహన్ రావు అన్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ దివంగత రాకేష్ మాస్టర్ శిష్యుడు కరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కెమెరామెన్ పి. సురేష్ ప్రత్యేకంగా నాలుగు పాటలు చిత్రీకరించారన్నారు. అక్టోబర్‌లో విడుదల కాబోతున్న ఈ రీల్స్ ద్వారా ఔత్సాహిక డాన్సర్ స్టూడెంట్స్‌కు మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

బడ్డీ పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


బొబ్బిలి: యోగ కేంద్రం పార్కింగ్ స్థలం వద్ద బడ్డి పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యోగ కేంద్రం డైరెక్టర్లు ప్రసాద్, సత్య, అభ్యాసకులు కోరారు. యోగ కేంద్రం వద్ద పార్కింగ్ స్థలంలో దౌర్జన్యంగా బడ్డి పెట్టారని, దీంతో పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. బడ్డి పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం వినతి పత్రాలను అందించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆసుపత్రి భవనాలకు శంకుస్థాపన

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 50 లక్షల రూపాయలతో నిర్మించబోయే ల్యాబ్, డయాగ్నోస్టిక్ సెంటర్ భవనాలకు సోమవారం ఎంపిపి మహంతి కళ్యాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యమే పరమార్థంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ నూతన భవనాలతో మరింత మెరుగైన వైద్యం అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ సీతారాం, వైద్య అధికారులు, పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి 'మేమున్నాం'

గరివిడి : చీపురుపల్లి మండలం వంగపల్లి పేట గ్రామానికి చెందిన గొల్లబాబు రెండు కాళ్లకు ఇన్‌ఫెక్షన్ రావడంతో గత సంవత్సరం కాలంగా నరకం అనుభవిస్తున్నాడని తెలుసుకొని ప్రతీ నెల మాతృభూమి సేవా సంఘం దాతలు సహాయంతో మందులు ఇస్తున్నారు. ఇందులో భాంగా ఈ నెలకు చెందిన మందులను సోమవారం అతనికి అందించారు. కాగా హెల్పింగ్ హేండ్ హిజ్రా అసోసియేషన్ అధ్యక్షులు దవడ కొండబాబు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాతృభూమి సేవా సంఘం ద్వారా గొల్లబాబుకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం నియోజకవర్గం ఇంచార్జ్ బూర్లె పైడినాయుడు, ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి అధ్యక్షులు జాగరపు ఈశ్వర్ ప్రసాద్, విఎ సత్యం తదితరులు పాల్గొన్నారు.


బోగేష్‌ను సత్కరిస్తున్న ఇంఛార్జి బంగార్రాజు, తదితరులు

యాదవ సాధికార సమితి సభ్యులుగా బోగేష్

పూసపాటిరేగ: విజయనగరం పార్లమెంటరీ, నెల్లిమర్ల నియోజకవర్గం యాదవ సాధికార సమితి మెంబర్‌గా మురపాల బోగేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ బంగార్రాజును సోమవారం తన స్వగృహం పోలిపల్లిలో మర్యాదపూర్వకంగా కలశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆయన బోగేష్‌ను సన్మానించి అభినందించారు. మీలాంటి యువత పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కోరారు. బంగార్రాజుని కలిసిన వారిలో విజయనగరం పార్లమెంటరీ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు, పూసపాటిరేగ మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు, బత్తివలస సర్పంచ్ కొర్నాన వెంకటప్పుడు, కొల్లాయవలస మాజీ సర్పంచ్ దువ్వు అప్పలస్వామి, పూసపాటిరేగ ఎంపిటిసి పిన్నింటి నాగరాజు, నెల్లిమర్ల నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పిన్నింటి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు ఎ. జగన్మోహన్ రావు పిలుపునిచ్చారు. సోమవారం నెల్లిమర్లలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామతీర్థం, ముషిడిపల్లి, నెల్లిమర్ల పంప్ హౌస్ కార్మికులను కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలన్నారు. ఇంజినీరింగ్ సిబ్బందికి రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాత పద్ధతిలో పింఛన్ కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మిక సంఘం నాయకులు టి. బాబూ రావు, హరి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

బొబ్బిలి: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అందర్నీ 6 నెల్లో పర్మినెంట్ చేస్తామని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌ను పెద్ద తేడా లేదని 2019 ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వాగ్దానం చేసి మాట తప్పారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు అన్నారు. ఈ నెల 24న విజయవాడలో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమంలో బొబ్బిలి నుంచి వేలాది మంది పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు సోమవారం కోవెల సెంటర్లో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా మనకు ఇచ్చిన వాగ్దానాలకు అతీగతి లేదన్నారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రెసిడెంట్ జి. గౌరీ, కార్యదర్శి జె. రామారావు, కమిటీ సభ్యులు జి. వాసు, బి. వెంకటి కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా బీమా

బొబ్బిలి: కుటుంబంలో ప్రమాదవశాత్తు, ఆకస్మిక మరణం చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ బీమా అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కలవరాయి గ్రామానికి చెందిన పాము సింహాచలం ఇటీవల గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రమాదవశాత్తు మృతి చెందారు. వీరికి వైఎస్ఆర్ జీవిత బీమా పథకం ద్వారా రూ.5 లక్షల మంజూరు కావడంతో సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్, ఎంపిటిసి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మృతుని భార్యకు చెక్కును అందజేశారు.

లీకులను నివారించాలి

బొబ్బిలి: స్థానిక షిరిడి సాయిబాబా ఆలయం ఎదురుగా మున్సిపల్ పైపులైన్ లీకులను నివారించాలని పిసిసి సభ్యులు ముఖ్యల శ్రీనివాసరావు కోరారు. పైపులైన్ లీకులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ లీకులతో ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందడం లేదన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- బాడంగి

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలో గూడెపు వలస సచివాలయం పరిధిలో రావివలస, పూడివలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి మూడేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పథకాలకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ పేదవాడు ఏ పార్టీలో ఉన్నాసరే వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎలాంటి రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హులైన వారికి నేరుగా వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. మూడేళ్ళలో ఆ కుటుంబం పొందిన లబ్ధిని ఎమ్మెల్యే శంబంగి వివరించి బుక్ లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్‌రావు, ట్రైకర్ డైరెక్టర్ చిన్నపుదొర, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వంగర

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదా సీదాగా సాగింది. వ్యవసాయ శాఖ సమీక్షలో రైతులు సాగు చేస్తున్న పంటలకు ఇప్పటివరకు ఇకెవైసి పూర్తి కాకపోతే రైతులు తమ పంటలను అమ్ముకునే సమయంలో తీవ్రంగా నష్టపోతారని వ్యవసాయ శాఖ అధికారి కన్నబాబుపై ఎంపిపి, ఎంపిటిసి కరణం సుదర్శనరావు మండిపడ్డారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లతో త్వరితగతిన పూర్తిగా ఆ పనిని పూర్తి చేయాలని అన్నారు. విద్యుత్ శాఖ సమీక్షలో ఎం సీతారాంపురం పీడరు 65 కిలోమీటర్ల దూరం ఉన్నందున వివిఆర్ పేట, రాజుల గుమ్మడ గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్తు సరఫరా చేయలేకపోతున్నామని ఎఇ వినయ్ కుమార్ సర్వసభ్య సమావేశంలో సభ్యులకు క్షమాపణ కోరారు. వివిఆర్ పేటలో విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. సాగునీటి కాలువలు సక్రమంగా లేనందున తోటపల్లి కుడుకాలువ శివారు గ్రామాలకు సాగునీరు అందటం లేదని కనీసం జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలోనైనా పనులు చేపట్టి సాగునీరు అందించాలని వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, నూతన భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎఇ ఆనందరావు వెల్లడించగా సకాలంలో బిల్లులు చెల్లిస్తే పనులు చేపడతామని పలువురు సర్పంచులు స్పష్టం చేశారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని రైతులు ముందుకు రావాలని రాజాం ఉద్యానవన శాఖ అధికారి వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాస రావు, డిటి బూరాడ సుందర రావు, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



ఎఒ కన్నబాబును ప్రశ్నిస్తున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ

పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి మండలం కర్లాం పిహెచ్‌సి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. పిహెచ్‌సి ఛైర్‌పర్సన్, ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, వైసిపి నాయకులు అనంతం, శ్రీనివాస నాయుడు పాల్గొని మాట్లాడారు. పిహెచ్‌సి సిబ్బంది ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని న్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పిహెచ్‌సిలో వసతులు ఉండేలా చూసుకోవా లన్నారు. వైద్య పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాల న్నారు. తల్లి, బిడ్డల ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని సూచిచించారు. గర్భిణులకు ఆసుపత్రిలో వ్యాయామం చేయించాలని, దీంతో నార్మల్ డెలివరీలు సులభంగా చెయొచ్చుననే విధానం, పెద్ద ఆపరేషన్ల ద్వారా జరిగే నష్టాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.కుక్కకాటు, పాముకాటు ఇతరత్రా వ్యాధుల మందులు మూడు నెలలకు సరిపడేలా స్టాక్ ఉన్నాయా లేదా అని ఫార్మాసిస్టును ఆరా తీశారు. అవసరమైన మందులు తెప్పించి పెట్టాలని డాక్టర్ సువర్ణకి ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి పతివాడ రాజారావు, అలజంగి సర్పంచ్ రఘుమండ రమణమ్మ, ఎంపిటిసి బాణన రమణ, తహశీల్దార్ సురేష్, పిహెచ్‌సి డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పట్టణంలో ప్రముఖ ఫర్నీచర్ బ్రాండ్ రాయల్ ఓక్ ఫర్నీచర్ స్టోర్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఛార్టర్డ్ అకౌంటెంట్ మడిపల్లి రామారావు, ఎస్ వి ఎన్ శ్రీనివాస్ సుజాత గ్రూప్ చైర్మన్ జి శ్రీనివాస రావు , రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, హెూల్సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బుద్దెపు వెంకటరావు , ద గోల్డ్ , డైమండ్ జ్యువలరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ వి శ్రీనివాస రావు ప్రారంభించారు.

-ప్రజాశక్తి, విజయనగరం

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలో ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీని వాసరావును, డిఇ ఎస్.రవికుమార్, ఏఇ వి.సురేష్‌ను కౌన్సిలర్లు సోమవారం సత్కరించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు జగనన్న ఇళ్ల నిర్మాణంలో జిల్లాలో బొబ్బిలి మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, డిఇ రవికుమార్, ఏఇ సురేష్ ఉత్తమ అధికా రులుగా ఎన్నికై ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు చేతులు మీదుగా అవార్డులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ అధికారులను మున్సిపల్ కార్యాల యంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, బొత్స రమణ మ్మ, పి.ఉమా శంకర్, ఇంటి గోవిందరావు, ఎస్.రామ కృష్ణబాబు, వైసిపి నాయకులు దిబ్బ గోపి, ఎం.మురళీ కృష్ణ పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉత్తమ అధికారిగా ఎంపికైన ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతులు మీదుగా అవార్డు అందు కున్న ఎంపిడిఒ ఎస్ రామకృష్ణను సోమవారం సిబ్బంది సత్కరించారు. విఆర్‌ఒల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. నర్సినాయుడు మాట్లాడుతూ అందరితో కలిసిపోయే స్వభావం కలిగిన ఎంపిడిఒను సత్కరించుకోవడం తమ కు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ ఎంలు, సర్వే అసిస్టెంట్‌లు, మహిళా సంరక్షణ కార్యద ర్శులు తదితరులు పాల్గొన్నారు.

భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

గ్రోత్ సెంటర్ భూములపై శ్వేతా పత్రం విడుదల చేయాలని జనసేన ఉత్తరాంధ్ర నాయకులు ఆదాడ మోహన్, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి డిమాండ్ చేశారు. జనసేన కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మద్యం, ఇసుక, గనులు కబ్జాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రోత్ సెంటర్‌లో భూములు కబ్జాకు అధికారికంగా పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికే బికె స్టీల్స్ పరిశ్రమ వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. పరిశ్రమలు పెట్టాలంటే వైసిపి మంత్రులకు 50శాతం పిసిలు ఇవ్వాల్సి ఉండడంతో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదన్నారు. పరిశ్రమ భూములతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. గ్రోత్ సెంటర్‌లో ఎకరా రూ.90లక్షలు ఉంటే రూ.10లక్షలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్ భూములు ఎకరా రూ.3కోట్లు వరకు ధర పలుకుతుందన్నారు. గ్రోత్ భూములను నిబంధనలకు లోబడి కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జనసేన నాయకులు వి.సంతోష్, రాకెష్, తదితరులు పాల్గొన్నారు.

'కొప్పల వెలమను బిసిఎలో చేర్చాలి'

ప్రజాశక్తి- బాడంగి

ఉత్తరాంధ్రలో వెనుకబడిన కొప్పుల వెలమ కులస్తులను బిసిడి నుంచి బిసిఎలో చేర్చాలని కొప్పలవెలమ బిసి సాధికారిత జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు కోరారు. సోమవారం యువగళంలో నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కమిషన్ వేసి తప్పకుండా న్యాయం చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు అప్పలనాయుడు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం నిడమానూరు వద్ద బిసిలు, చేతివృత్తిదారులతో నారా లోకేష్ నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. సమావేశంలో బిసిల సమస్యలను, కొప్పులవెలమ వెనుకబాటుతనాన్ని వివరించినట్లు తెలిపారు. పార్టీకి బ్యాక్ బోన్‌గా ఉన్న కొప్పుల వెలమ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరగా వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా మరింత గుర్తింపు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జలసిరి ద్వారా బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని కోరినట్లు చెప్పారు. విదేశీ విద్యకు ప్రోత్సాహం, ఉన్నత విద్యకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.


అధ్యక్షులు శ్రీనివాసరావును అభినందిస్తున్న తోటి విలేకర్లు

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లిమర్ల: స్థానిక ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. ముందుగా ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం గౌరవ అధ్యక్షులు, సీనియర్ రిపోర్టర్ ఆరిపాక రాము ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా కాళ్ళ శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ ఉన్నతకి, పాత్రికేయుల ప్రయోజనాలను కాపాడే విధంగా నడుచుకుంటానని, కార్యవర్గ సహచరులతో సఖ్యతతో మెలగతూ వారి నిర్ణయాలు సారంగానే నడుస్తానని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షున్ని కార్యవర్గ సభ్యులు అభినందించారు.

గురుకులాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట వద్దగల బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల వసతి గృహం, కేజీబీవీ వసతిగృహాన్ని కలెక్టర్ ఆదేశాలు మేరకు సోమ వారం ఎంపిడిఒ పట్నాయక్ పరిశీలించారు. ఆ వసతి గృహాల ఆవరణలో ఖాళీ స్థలాలను చదును చేసి నివేదికను తమకు అందించాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆయన పరిశీలన చేశారు. క్రీడా మైదానాలలో రాళ్లు తేలిపోయి ఉండటంతో మెత్తటి ఇసుకను వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పిఆర్‌జెఇ ఆలీకి సూచించారు. సామాజిక కార్యకర్త ఆర్ అప్పారావు ఆధ్వర్యంలో పనులు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. మంగళ వారం నుంచే పనులను ప్రారంభించి ఏ రోజు చేసిన పని ఆరోజే జిల్లా పరిషత్ సిఇఒకు నివేధిం చాలన్నారు. ఇటీవల స్పందనలో ఈ రెండు వసతి గృహాల ఆవరణలో దట్టమైన చెట్లు, పిచ్చి మొక్కలు ఉండటంతో పాములు వచ్చే ప్రమాదం ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, సామాజిక కార్యకర్త అప్పారావులు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆమె వెంటనే వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పరిశీలనలో పిఆర్ జెఇ అలీ, ప్రిన్సిపల్ పిఎం ఫోరెన్సి, కేజీబివి పీఈటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ, జెఇ

సాధన కమిటీ వితరణ

ప్రజాశక్తి - జామి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సాధన కమిటీ సభ్యులు విద్యార్థులకు, పాఠశాల విద్యకు అండగా నిలిచారు. విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు జామి జిల్లా పరిషత్ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వామ్యం అయ్యారు. 2016లో కాలేజీ సాధన కమిటీ ఏర్పాటు జరిగింది. కాలేజీ ఏర్పాటు సాధ్యం కాదన్న వార్తలతో కమిటీ రద్దు చేశారు. కాలేజీ సాధనకు అప్పట్లో విరాళాలు సేకరించగా రూ.5.27 లక్షలు పోగేసి, కమిటీ రద్దుతో ఎవరి విరాళాలు వారికి వెనక్కి ఇచ్చేశారు. అయితే దాని నుంచి వచ్చిన వడ్డీ సొమ్మును ఇటీవల గ్రంథాలయం అభివృద్ధి పనులకు రూ.30వేలు విరాళంగా ఇచ్చారు. హైస్కూల్లో అభివృద్ధి పనులకు రూ.14వేలు, కుర్చీలు అందజేశారు. అలాగే తల్లి దండ్రులు లేని విద్యార్థులకు రూ.2,500 చొప్పున 13 మంది విద్యార్థులకు అందజేశారు. మెరిట్ విద్యార్థులకు రూ.12వేలు అందజేశారు. ఇలా కాలేజీ సాధన కమిటీ రద్దు చేసినా విద్యకు అండగా నిలవడం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాలకు కుర్చీలను అందిస్తున్న సభ్యులు

చురుగ్గా సిసి రోడ్డు నిర్మాణం

వేపాడ: మండల కేంద్రంలోని రామాలయం వీధిలో రూ. 2లక్షలతో సిసి రోడ్డు, డ్రైయినేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ అర్జునమ్మ పర్యవేక్షణలో ఈ పనులను మరింత వేగంగా చేపడుతున్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వినతుల స్వీకరణ

తెర్లాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ రామకృష్ణ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడైన విద్యుత్ స్తంభాలు స్థానంలో కొత్త స్తంబాలు వేయాలని, 16 కె.వి.ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది ఏర్పాటు చేయాలని గోపాలవలస నాయకులు వెంకట్రావు, మాజీ సర్పంచ్ గణపతిరావు, గ్రామస్తులు వినతిని ఇచ్చారన్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎఇకి సూచించామన్నారు.

వినియోగదారుల సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వినియోగదారుల సంఘం ఏర్పాటైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఏ రాజు తెలిపారు. విద్యార్థులలో వినియోగదారుల హక్కులు, అవకాశాలు తదితర అంశాల పట్ల అవగాహన కల్గించేందుకు ఇటీవల వినియోగదారుల సంఘ నిర్మాణంలో శిక్షణ పొందిన పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు పి. సన్యాసిరావు 8,9 తరగతుల విద్యార్థుల నుండి 9 మంది సభ్యులతో కూడిన కార్యనిర్వాహక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ నెల ఈ సంఘ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలించిన ఎంఇఒ

సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి. బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన సెల్ఫ్ టెస్టులు, పిఎస్ ఎగ్జామినేషన్ పరిశీలించారు. పదో తరగతిలో శతశాతం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు కూడా దృష్టి పెట్టి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు బిపిపి. రాజు, సిఆర్పిలు పాల్గొన్నారు.

12 ఇళ్లను దోచేసిన దొంగ అరెస్టు

- 27తులాల బంగారు ఆభరణాలు, 6కిలోల వెండి స్వాధీనం: డిఎస్‌పి

ప్రజాశక్తి- విజయనగరం

పట్టణ పరిధిలో 12 ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 27 తులాల బంగారు ఆభరణాలు, 6కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు విజయనగరం డిఎస్‌పి ఆర్. గోవిందరావు తెలిపారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. మెంటాడ మండలం కొప్పంగి గ్రామానికి చెందిన కె. శ్రీనివాసరావు ప్రస్తుతం విజయనగరం పట్టణంలోని ఉడాకాలనీలో నివాసం ఉంటున్నాడు. గతంలో సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా పదేళ్లు పనిచేసిన శ్రీనివాసరావు ఉద్యోగం మానేసి చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ నేపథ్యంలోనే ఉడాకాలనీ, బాబామెట్ట ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు ఆధ్వర్యంలో ఒక బృందం శ్రీనివాసరావును పట్టుకునేందుకు ప్రయత్నించగా ఆదివారం స్థానిక సాలిపేట ప్రాంతంలో గురజాడ పబ్లిక్ స్కూల్ రోడ్డు వద్ద పట్టుబడ్డాడు. ఇతను ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఏడు నేరాలు, రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఐదు నేరాలకు పాల్పడ్డాడు. సంవత్సరకాలంలో 12 దొంగతనాలకు పాల్పడగా ఆయన వద్ద నుంచి రూ. 25లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి తెలిపారు. దొంగను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను ఆయన అభినందించారు.


వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి